పఠనాలయం లేక పాట్లు

గ్రంథాలయం కోసం యువత ఎదురుచూపులు

- పోటీ పరీక్షల సన్నద్ధతకు ఆటంకాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తాటిగూడెంలో రోడ్డు పక్కన దినపత్రికలు చదువుతున్న యువత

కరకగూడెం: పుస్తకాలు, వార్తా పత్రికలు అందుబాటులో ఉంచే గ్రంథాలయాలు పట్టణ ప్రాంతాలకే పరిమితమవుతున్నాయి. కొత్త విషయాలు నేర్చుకోడానికి, కల్పనా శక్తిని పెంపొందించడానికి తోడ్పడే ఈ పఠనాలయాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందని ద్రాక్షగా మిగులుతున్నాయి. పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన కరకగూడెం మండలంలో విజ్ఞాన బాంఢాగారం అందుబాటులో లేదు. కానీ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేసింది. ఈ తరుణంలో నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే కానీ పూటగడవని గ్రామీణ యువతకు పోటీ పరీక్షల శిక్షణకు ఖర్చుచేసే ఆర్థిక స్థోమత ఉండదు. ఈబయట ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో వారికి స్థానిక గ్రంథాలయాలే ఆధారం.

వార్తాపత్రికలకే పరిమితం..

కరకగూడెం మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీలున్నాయి. బీఈడీ, పీజీ, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఫార్మసీ, పారామెడికల్ విద్యార్హత ఉన్న వారు చాలా మందే మండలంలో ఉన్నారు. గ్రంథాలయం లేకపోవడంతో గ్రామీణులు ఎక్కువ శాతం రోజువారి దినపత్రికల పఠనానికే పరిమితమవుతున్నారు. మరికొన్ని చోట్ల పుస్తక పఠనంతో పాటు అవసరమైన విజ్ఞానాన్ని స్మార్ట్‌ఫోన్‌తో డౌన్లోడ్ చేసుకుని ముందుకు సాగుతున్నారు. కాగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వడం కోసం మండల కేంద్రంలో ఒక గ్రంథాలయం ఏర్పాటు చేస్తే ఎంతో మేలు కలుగుతుందని ఇంట్లో ఒంటరిగా కొలువులకు సన్నద్ధం కాలేమని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికార యంత్రాంగం స్పందించి గ్రంథాలయ ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతున్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి



గ్రామీణ ప్రాంత యువత కోసం గ్రంథాలయం ఏర్పాటు చేస్తే ఎంతో మేలు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు గ్రంథాలయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్య, సాంస్కృతిక, సామాజిక అంశాలపై విస్తృతమైన జ్ఞానం అందించే గ్రంథాలయం ఏర్పాటుపై చిన్నచూపు తగదు.– **పూనెం ఓంకార్, తాటిగూడెం**

పట్టించుకునే వారు కరువయ్యారు



కరకగూడెం మండలం ఏర్పడి దాదాపు పదేళ్లు కావస్తున్నా నేటి వరకూ మండలంలో గ్రంథాలయం ఏర్పాటు చేయలేదంటే పాలకుల, అధికారులు నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. గ్రంథాలయంతో సాధన, మోటివేషన్, విజ్ఞానం కలుగుతుంది. తద్వారా వారు తమ లక్ష్యాలను చేరుకునే మార్గం సులువవుతుంది. **– ఆళ్ల సుమన్, కరకగూడెం**

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా..



మండలంలో గ్రంథాలయం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. ఎవరైనా స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి గ్రంథాలయం ఏర్పాటుకు చొరవ చూపిన కూడా వారిని స్వాగతిస్తాం. ప్రస్తుత రోజుల్లో గ్రంథాలయం ఉండడం ఎంతో అవసరం. – **నాగ ప్రసాద్, కరకగూడెం తహసీల్దార్**

క్లుప్తంగా

మంత్రి తుమ్మల నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

దమ్మపేట: ఇటీవల మరణించిన మోరంపూడి వెంకటేశ్వరరావుకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళులర్పించారు. సోమవారం మండల పరిధిలోని శ్రీరాంపురం గ్రామంలో జరిగిన వెంకటేశ్వరరావు దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని కొత్తపల్లికి చెందిన ఐతం రామేష్‌కు తన స్నేహితులు సోమవారం వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. రమేష్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్సకు సరిపడా నగదు లేక ఇబ్బంది పడుతున్నాడని ఆయన స్నేహితులకు తెలిసింది. దీంతో ఆయనతో కలిసి ఎస్సెస్సీ చదివిన (1998 బ్యాచ్) మిత్రులు రూ.35వేలు అందజేశారు. ఇటీవలే ఇదే బ్యాచ్‌కు సుజాత కుమార్తె కిడ్నీ ఆపరేషన్ కోసం రూ.50వేలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో కవ్వాల రాము, బిట్రుగుంట క్రాంతికుమార్, చింతూరి వినోద్ కుమార్, తడికల రవికుషోర్, ఇనుపకోళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సారపాకలో సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవటంతో ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుండి జీవాలకు గాలికుంటు టీకాలు

ములకలపల్లి: మండలవ్యాప్తంగా మంగళవారం నుండి జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 14 వరకు తెల్ల, నల్లజాతి పశువులకు వ్యాక్సినేషన్ ఉంటుందని, పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అశ్వాపురం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్ రెడ్డి అన్నారు. నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మల్లెలమడుగులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో నంబర్ 27 ప్రకారం 33 రకాల సన్న వరిధాన్యానికి ప్రభుత్వం ఒక క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుందని రైతులు కొనుగోలు కేంద్రాలనే వినియోగించుకొని మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సీఈఓ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని కొండాయిగూడెం గ్రామంలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఎస్‌కే ఉమర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో 2005కు పూర్వం నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు ఉమ్మడిగా పట్టాలిచ్చారని, ప్రభుత్వ భూములను సర్వేచేసి సాగుచేస్తున్న గిరిజనులకు విడివిడిగా పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారం వెంకటేశ్వర్లు, కారం కుమారి, కుంజ సావిత్రి, మడకం రాఘవమ్మ, కాక సంతోషమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభ్యున్నతికి సహకారం అందిస్తా..

- ఎమ్మెల్యే ఆదినారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: ఆదివాసీ పాస్టర్ల అభ్యున్నతికి తనవంతు సహకారం అందిస్తానని, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని నల్లకుంట గ్రామంలో జాతీయ ఆదివాసీ పాస్టర్ల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారేను ఐక్యవేదిక తరఫున ఘనంగా సన్మానించారు. పాస్టర్ల అభ్యున్నతికి సహకరించాలని ఐక్యవేదిక తరఫున కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆదివాసీ పాస్టర్లు సహృదయంతో దేవుడికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది పెనుబల్లి రమేష్, పాస్టర్లు నిరీక్షణరావు, ఫిలిప్పు, ఎలీషా, సామ్యూల్, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు



బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

అశ్వారావుపేటరూరల్: నిషేధిత మత్తు పదార్థాలను పట్టుకునేందుకు పోలీసులు నార్కోటిక్ జాగిలం సాయంతో సోమవారం పలుచోట్ల ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్ తోపాటు పలు కిరాణా దుకాణాలు, మేజర్ పంచాయతీ రోడ్, ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ప్రాంతం, పేటమాలపల్లితోపాటు పలు అనుమానిత ప్రాంతాల్లో ఈ తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ పరిసరాలు, ప్రయాణికుల బ్యాగుల తోపాటు బస్సులు, అనుమానిత ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అదే విధంగా మాదకద్రవ్యాల వినియోగంపై ఇబ్బందులు, చట్ట ప్రకారం తీసుకునే చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై యయాతి రాజు మాట్లాడుతూ.. గంజాయి, ఎన్‌డీపీఎస్ పదార్థాల సమాచారం ఉంటే తక్షణమే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, ఈ సమాచారం అందించిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీల్లో పీఎస్సై విజయ్, కానిస్టేబుళ్లు శివ, శంకర్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించండి



పనులు పరిశీలిస్తున్న డీఈఈ సైదుల్‌రెడ్డి

చండ్రుగొండ : అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈఈ సైదుల్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మార్గంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, జెడ్పీ పాఠశాలలో డ్రైయినేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పక్కా ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

ములకలపల్లి: అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. పార్టీ స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామకమిటీలు పారదర్శకంగా పని చేయాలని సూచించారు. వర్గాలు, పార్టీలకతీతంగా అర్హులకు ఇళ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మాలోతు రావూజా, ఊకంటి రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, నిమ్మల మధు, గోపగాని లక్ష్మీనర్సయ్య, బైరు ప్రసాద్, కుంజా రామ్మూర్తి, అమల పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి..

దుమ్ముగూడెం: పెండింగ్‌లో ఉన్న పోడు భూములకు పట్టాలివ్వాలని, పోడు భూములకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని చిన్న నల్లబెల్లి, గంగోలు శాఖ మహాసభలలో ఆయన మాట్లాడారు.. పోడు భూములు పట్టాల కోసం దరఖాస్తులు చేసిన రసీదు ఉండి ఆన్లైన్ అవ్వని వాటిని వెంటనే సరి చేయాలన్నారు. అలాగే పోడు భూమి పట్టాలున్న ప్రతీ ఒక్కరికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు త్రీఫేస్ కరెంట్ ఇచ్చి ఐటీడీఏ ద్వారా ఉచిత బోర్లు, మోటర్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిలువకుమార్, బిల్లపాటి రాజు, మర్మం చంద్రయ్య, మాజీ సర్పంచ్ మీడియం జయ, రాంబాబు, ఆనంద్, సుధాకర్, దన్ని నరసింహారావు, రాధా, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

'నాయకపోడు' జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు

అశ్వారావుపేట రూరల్: నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షుడిగా అశ్వారావుపేట మండలం వేదాంతపురం మాజీ సర్పంచ్ సోమిని శివశంకర్ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక గిరిజన భవన్‌లో నాయకపోడు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శిగా తాళ్ల దుర్గయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పసల బుచ్చయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పూసి గోవర్ధన్, బోగి వీరాస్వామి, సంగం నాగేశ్వరరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు రావుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారులకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

మణుగూరు రూరల్ : సింగరేణి వార్షిక లాభాల నుండి ప్రత్యేక ప్రోత్సాహక బహుమతిగా రూ.5 వేలను కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ సోమవారం సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్ఓటు జీఎం డి.శ్యాంసుందర్, ఏజీఎం(సివిల్) డి వెంకటేశ్వర్లును కాంట్రాక్ట్ కార్మికులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగోత్ మంగీలాల్, రబ్బాని, గురుమూర్తి, శివరామకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, గోపి, కన్వేయన్స్ వాహన డ్రైవర్లు బాలు, వెంకటేష్, సందీప్, ప్రదీప్, వెంకటేష్, జగదీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి..



నాగేశ్వరరావు దంపతులతో గ్రామస్తులు..

దుమ్ముగూడెం: మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన గట్టుపల్లి నాగేశ్వరరావు వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ పొందగా అచ్చితాపురం ఉద్యోగస్తుల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ గట్టుపల్లి లింగరాజు, సోయం కృష్ణ, మిచ్చ వెంకటేశ్వరరావు, మిచ్చా శ్యామల, పూర్ణ, గట్టుపల్లి రామ్‌ప్రసాద్, శేషగిరి, రామకృష్ణ, శశికళ, గట్టుపల్లి కృష్ణ, తెల్లం దర్మయ్య, సోయం కామరాజు, సొందే మల్లూరు, మారయ్య, కారం యేసు బాబూ, మిచ్చా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి



మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బూర్గంపాడు: పోలీసులు ఆ శాఖ స్థాయిని దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నారని, జిల్లాలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు ఆత్మహత్యలకు పాల్పడుతుండటం ఆ శాఖ వైఫల్యాలకు నిదర్శనమని, కానిస్టేబుల్ సాగర్ ఆత్మహత్యకు కారకులను చట్టపరంగా శిక్షించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు.. కొంతమంది పోలీస్ అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. పోలీస్ అధికారుల అండదండలతో కొందరు నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలన్నారు. ఏనుగుల వెంకటరెడ్డి, గుగులోత్ బాలునాయక్, బీరక సాయి శ్రీనివాస్, చుక్కపల్లి బాలాజీ, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్ : కానిస్టేబుల్ భూక్యా సాగర్ ఆత్మాహత్యాయత్నానికి పాల్పడి మరణించడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన మండలాధ్యక్షుడు భూక్యా సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సాగర్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. గిరిజన ఉద్యోగులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన పులుసాని మహేష్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా సోమవారం దశదినకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య హాజరై మహేష్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, కాంగ్రెస్ నాయకులు ముత్తినేని వాసు, వేములపల్లి రమేష్, కందిమళ్ల రాంరెడ్డి, పర్వత నరేష్, నాయకులు పాల్గొన్నారు.

'పేట'లో భారీ వర్షం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. అశ్వారావుపేట, ఊట్లపల్లి, వినాయకపురం, వేదాంతపురం, జమ్మిగూడెంతోపాటు పలు గ్రామాల్లో దాదాపు గంటన్నరపాటు ఎడతెరిపిలేకుండా జోరు వర్షం పడటంతో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి.

ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలి



ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ములకలపల్లి: తిమ్మంపేట శివారులో రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూపా భాస్కర్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు గడుస్తున్నా, నేటికి అందుబాటులోకి రాలేదన్నారు. అధికారులు స్పందించి, వినియోగంలోకి తేవాలన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు కల్లూరి కిషోర్, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల సంయుక్త అధ్యక్షుడు కొర్సా రామకృష్ణ ఉన్నారు.

మండల అధ్యక్షుడిపై వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న నాయకులు

కరకగూడెం: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీల విషయంలో కాంగ్రెస్ నాయకుల మధ్య వివాదం మొదలైంది. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమత్ భట్టుపల్లి, భట్టుపల్లి గ్రామ చాయతీ ఇందిరమ్మ కమిటీ సభ్యులుగా ఎన్నికైన పూనెం బుచ్చయ్య, బరపాటి వెంకన్న సోమవారం మాట్లాడారు. ఏళ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్న తమను మండలాధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ నాయకులు, కార్యకర్తల సమక్షాన ఇందిరమ్మ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారని తెలిపారు. అయితే, దీన్ని జీర్ణించుకోలేని కొందరు తమపై విమర్శలు చేయడమే కాక మండల అధ్యక్షుడిగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాగబండి వెంకటేశ్వర్లు, సాగర్, బిజ్జ రామనాథం, అర్జున్, రఫీ, దొంతు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

మణుగూరు రూరల్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మణుగూరు మండలంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పి.నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ సెంటర్‌లోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాక సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో అధికారులతో సమీక్షిస్తారని వెల్లడించారు. ఈ మేరకు మహిళా నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో మహిళలు, నాయకులు

చండ్రుగొండ : మండలకేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ ఆటపాటలతో బతుకమ్మను ఊరేగించి గంటే వీరయ్యకుంటలో నిమజ్జనం చేశారు. నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, ఇస్లావత్ రుక్మిణి, శ్రీను, శంకర్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

మణుగూరు రూరల్ : మండలంలోని మణుగూరు సింగరేణి హైస్కూల్ 2005–06 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సూర్యాకాంతం, హసీనాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, పవన్ కల్యాణ్, ప్రియాంక, బిందు, రేణుశ్రీ, బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు



కిక్కిరిసినా ఎక్కాల్సిందే..

అశ్వారావుపేటరూరల్: దసరా పండుగ సెలవులు ముగిసిపోవడంతో తిరుగు ప్రయాణం చేసే వారితో అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో రద్దీ నెలకొంది. ఉదయం నుంచే వివిధ ప్రాంతాలకు తరలివెళ్లేందుకు ప్రయాణికులు భారీగా బస్టాండ్‌కు చేరుకోగా, బస్టాండ్ ఆవరణ అంతా కిటకిటలాడింది. బస్టాండ్‌లో లోపల సరిపడా బల్లాలు, కుర్చీలు లేకపోవడంతో బస్సుల కోసం గంటల కొద్ది ప్రయాణికులు నిలబడి అవస్థలు పడ్డారు. బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి.